మీనంపై అలివి వల

జిల్లా జలనిధి సోమశిల జలాశయంపై అలివి వల పగబడుతోంది. సమృద్ధిగా ఉన్న జలాశయంలో చేపలవేట అనాధిగా సాగుతోంది. అయితే ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు నిబంధనలు పాటించకుండా అలివి వలలతో(చేప పిల్లలను సైతం పట్టుకునే) వేట సాగిస్తుండడంతో స్థానిక మత్స్యకారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వేట నిషేధ సమయంలో కూడా అలివి వలలతో చేపలు పడుతుంటే చేప పిల్లల వృద్ధి ఎలా జరుగుతుందని, తమ జీవనాధారం ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

- సోమశిల జలాశయ లోతట్టు ప్రాంతంలో యథేచ్ఛగా చేపల వేట
- ఇతర జిల్లాల వ్యక్తులకు లైసెన్సులు
- వేట నిషేధమున్నా నిబంధనలు బేఖాతర్



సోమశిల జలాశయం (ఫైల్)

ఆత్మకూరు: ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో లైసెన్స్‌లు పొందిన జాలర్లు మాత్రమే జలాశయంలో చేపలవేట సాగిస్తారు. ఈనేపథ్యంలో గత కొన్నేళ్లుగా రాష్ట్రంలోని రాజమండ్రి, పశ్చిమ గోదావరి, తమిళనాడు ప్రాంతాలకు చెందిన పలువురు లైసెన్సులు పొంది చేపలవేట సాగిస్తున్నారు. సాధారణ వలలు ఉపయోగించి చేపల వేట సాగించాలని నిబంధనలు ఉన్నా ఇతర ప్రాంత వ్యక్తులు ప్రమాదకరమైన 'అలివి వలలు' ఉపయోగించి వేట సాగిస్తున్నారు. పలు మార్లు ఈ విషయంపై స్థానిక జాలర్లు అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

నిషేధ సమయంలోనూ..

జలాశయంలో చేపల బ్రీడింగ్ సమయం జూలై, ఆగస్టు నెలల్లో ఉంటుంది. ఈ రెండు నెలల్లో చేపలవేట కొనసాగించకూడదనే నిబంధన ఉంది. ఈ క్రమంలో వారి జీవనం కోసం ప్రభుత్వం బియ్యం, నగదు తదితర సహాయాలు చేస్తుంటాయి. అయితే నిషేధ సమయంలోనూ నిబంధనలు బేఖాతర్ చేస్తూ చిన్న చేప పిల్లలు సైతం చిక్కేలా అలివి వలలను ఉపయోగించి వేట సాగిస్తున్నారు. దీనిని మత్స్యశాఖ అధికారులే చూసీచూడనట్లు వ్యవహరించి సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో నిబంధనలు పాటిస్తున్న స్థానిక జాలర్లకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన జాలర్లకు తరచూ గొడవలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ఇలా జరిగిన గొడవల్లో రాజమండ్రికి చెందిన చిన్నబాబు అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు.

ఓ అధికారి నిర్వాకంతో..

గతంలో జలాశయ పరిధిలో ఫిషరీష్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన అధికారి రాజమండ్రి ప్రాంతం వారితో పాటు తమిళనాడుకు చెందిన జాలర్లకు లైసెన్సులు మంజూరు చేశారని, స్థానిక జాలర్లతో సమానంగా అన్ని హక్కులు కల్పించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన కాలంలో ఇతర ప్రాంతాల జాలర్ల హవా కొనసాగింది. ఈ విషయాన్ని అప్పటి కలెక్టర్‌కు స్థానిక జాలర్లు ఫిర్యాదు చేయగా ఆయన్ను బదిలీ చేశారని, అయితే ఇతర ప్రాంతాల జాలర్ల లైసెన్సులు మాత్రం రద్దు కాలేదని స్థానిక జాలర్లు పేర్కొంటున్నారు. అనంతరం కొద్దికాలానికే సదరు ఇన్‌స్పెక్టర్ డిప్యుటేషన్‌పై వచ్చి చేపలవేట మాఫియాకు సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా వారిని లోతట్టు ప్రాంతాలకు పంపడం పట్ల స్థానిక జాలర్లు ఆ అధికారిని ప్రశ్నించగా ఆ ప్రాంతం తన పరిధిలోది కాదని, అది వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఉందని, దీనిపై ఒత్తిడి తెస్తే మీకిచ్చిన లైసెన్సులు రద్దు చేయిస్తానని, స్థానిక మత్స్యకారులను బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

మా పరిధిలో లేదు

జిల్లా పరిధిలో నిషేధ సమయంలో చేపల వేట సాగడం లేదు. జలాశయం వెనుక ప్రాంతమైన వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలో వేట సాగుతోందేమో కానీ అది మా పరిధి కాదు. వాస్తవానికి తమిళనాడు, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు చెందిన జాలర్లకు చేపల వేటలో మెళకువలు తెలియడంతో స్థానికులే వారిని తీసుకొచ్చారు.

– శ్రీనివాసరావు, ఫిషరీస్ ఏడీ

కాపలా ఉంచాం

నేను ఇటీవల విధుల్లోకి వచ్చాను. జలాశయం వద్ద ఉదయం 6 నుంచి రాత్రి 8 వరకు ఇద్దరు వ్యక్తులను కాపలాగా ఉంచాం. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేలా అప్రమత్తంగా ఉన్నాం. జలాశయం వెనుక భాగంలో రెండు కిలోమీటర్లు మాత్రమే జిల్లా పరిధి ఉంది. తరువాత వైఎస్సార్ జిల్లాలోకి వస్తుంది. అయితే మన జిల్లా పరిధిలో చేపల వేట జరగడం లేదు.

– సురేష్, ఫిషరీస్ ఇన్‌చార్జి ఎఫ్‌డీఓ

అక్కడే నివాసం

జలాశయం లోతట్టు ప్రాంతానికి వెళ్లి చేపలవేట సాగించే ఇతర ప్రాంత జాలర్లు అక్కడే ప్లాస్టిక్ పట్టలతో షెల్టర్ ఏర్పాటు చేసుకున్నారు. ఇలా వారు రేయింబవళ్లు వేట కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతంలోనే నాటుసారా సైతం తయారు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యథేచ్ఛగా రవాణా

జలాశయం ముందు భాగంలో స్థానిక మత్స్యకారులు రాత్రి వేళల్లో చేపలు పట్టి ఒడ్డుకు చేర్చి వ్యాన్ల ద్వారా నెల్లూరు లాంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇదిలా ఉంటే ఇతర ప్రాంతాల వారు లోతట్టు ప్రాంతానికి వెళ్లి భారీ వలల సాయంతో చేపల వేట చేసి క్వింటాళ్ల కొద్దీ చిన్నా పెద్ద చేపలను పట్టి వైఎస్సార్ కడప జిల్లా అట్లూరు మండలం మీదుగా తిరుపతి, చెన్నై, కోల్‌కతా లాంటి నగరాలకు యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు.



జలాశయంలో అలివి వలలతో సాగిస్తున్న చేపల వేట



పట్టిన చేపలను ఆరబోసిన వైనం



జలాశయ లోతట్టు ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక నివాసాలు

క్లుప్తంగా

పోలేరమ్మ తల్లికి విశేష పూజలు



విశేషాలంకారంలో పోలేరమ్మ తల్లి

సంగం: మండలంలోని తలుపూరుపాడు గ్రామంలో ఉన్న పోలేరమ్మ తల్లి ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని విశేష పూజలు జరిపారు. భక్తులు పూజా సామగ్రితో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టుకున్నారు. భక్తులు ప్రత్యేకాలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వసతి గృహాల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి : ఉదయగిరి నియోజకవర్గంలోని పలు వసతి గృహాలను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. హాస్టళ్లలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు, సమస్యలపై సోమవారం సాక్షిలో 'సంక్షామ వసతి గృహాలు' శీర్షికతో కథనం వెలువడిన నేపథ్యంలో ఉదయగిరి సహాయ సంక్షేమశాఖ అధికారి రమణారెడ్డి పలు వసతి గృహాలను విజిట్ చేశారు. సిద్ధనకొండూరు వసతి గృహం మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.6 లక్షల నిధులు మంజూరు చేయగా, కాంట్రాక్టర్ అరకొరగా పనులు చేపి నిలిపివేయగా, వారికి ఇంజినీరింగ్ అధికారులు నోటీసులు ఇచ్చారు. త్వరలో వేరే కాంట్రాక్టర్‌ను నియమించి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. వింజమూరు ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాల్లో అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు.

నాణ్యమైన బోధనే లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

ఉదయగిరి: విద్యార్థుల్లోని అంతర్గత నైపుణ్య, సామర్థ్యాలు వెలికితీసేలా నాణ్యమైన బోధన చేయాలని ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు సూచించారు. ఆయన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో విద్యార్థుల గణిత సామర్థ్యాలు పరిశీలించారు. ఈ క్రమంలో అసాధారణ ప్రతిభ చూపుతున్న ఏడో తరగతి విద్యార్థి షేక్.రెహాన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'స్వామిత్వ'పై శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రఫీఖాన్

ఆత్మకూరురూరల్: 'స్వామిత్వ' కార్యక్రమంపై ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, అనుమసముద్రంపేట, అనంతసాగరం, చేజర్ల మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్‌లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రఫీఖాన్ గ్రామ పంచాయతీల్లో నివాస గృహాలతో పాటు ప్రతి ఆస్తిని సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సర్వే చేయాల్సిన పద్ధతులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఆయా మండలాలకు చెందిన డిప్యూటీ ఎంపీడీఓలు, సంబంధిత విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కలిగిరి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. కలిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్ బెస్ట్ పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైన నేపథ్యంలో మంగళవారం శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నవరం శ్రీను, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచ్ దేవనబోయిన వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదాలు అరికట్టాలని ఆందోళన



పోలంగారిపల్లి రోడ్డు సెంటర్‌లో ఆందోళన చేస్తున్న ప్రజలు

సీతారామపురం: జాతీయ రహదారిపై ప్రమాదాలను అరికట్టేలా హైవే యంత్రాంగం సత్వరమే చర్యలు చేపట్టాలని కోరుతూ మండలంలోని దేవరాజు సూరాయపల్లి (పోలంగారిపల్లి) రోడ్డు సెంటర్‌లో మంగళవారం ప్రజలు ఆందోళన చేపట్టారు. ఎనిమిది గ్రామాలకు జంక్షన్ పాయింట్ ప్రధాన కూడలిలో జాతీయ రహదారి విశాలంగా లేని కారణంగా నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా జంక్షన్ పాయింట్‌లో జాతీయ రహదారిని విస్తరింపజేసి ఫ్లడ్ లైట్లు, రోడ్డుకు ఇరువైపులా ఇనుప కమ్ములతో బారికేడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆ దిశగా పాలకులు, అధికార యంత్రాంగం చర్యలు చేపట్టి జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాలను అరికట్టేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జాతీయ రహదారిపై మానవహారం ఏర్పాటు చేసి, ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. దీంతో ఉదయగిరి–సీతారామపురం మార్గంలో తిరిగే వాహనాలతో పాటు ప్రయాణికులకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. ఈ కార్యక్రమంలో నెమళ్లదిన్నె సర్పంచ్ తోకల రామచంద్రతో పాటు పోలంగారిపల్లి, సోంపల్లి, బెడుసుపల్లి, గంగవరం, దేవమ్మచెరువు, పోకలవారిపల్లి తదితర గ్రామాలకు చెందిన యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు



మర్రిపాడు: మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం జరిగిన పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులకు మంగళవారం ప్రోత్సాహక నగదును అందజేశారు. పాఠశాలలో తొలి ఐదు స్థానాలు సాధించిన లహరి, సమీరా, చరణ్, కీర్తి, శృతిలకు గ్రామానికి చెందిన వేమన ఓబయ్య, జయరత్నమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు శ్యామ్‌ప్రసాద్, సురేష్, కృష్ణకిశోర్‌లు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేల వంతున నగదు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఎం విజయభాస్కర్ మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. విశ్రాంత ఎంఈఓ సత్యనారాయణ, విశ్రాంత హెచ్‌ఎం కలిశెట్టి వెంకటరమణయ్య, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రమణయ్య, ఉపాధ్యాయులు వెంకటరమణయ్య, పెంచలరావు, బాలాజీ, తిరుపాలు, రహీమ, కలిశెట్టి రాజేంద్రకుమార్, సునీత, యలగాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన అవసరం



ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆత్మకూరు: విద్యార్థులు అంటువ్యాధులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆత్మకూరు అర్బన్ వైద్యశాల డాక్టర్ అస్మా అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఏపీ గురుకుల, బాలికల పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. వంటశాలలో పరిసరాలు, ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వల్ల విషజ్వరాలు ప్రబలుతాయన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా పాఠశాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు సైతం వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రూత్, ఎంపీహెచ్‌ఈఓ సుధాకర్, జి.రవీంద్రరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

వింజమూరు(ఉదయగిరి): మత్తు పదార్థాలను ఉపయోగించడం ద్వారా కలిగే అనర్థాలపై స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎస్సై వీర ప్రతాప్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపల్ జయంత్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతూ కక్షసాధింపు చర్యలకు పాల్పడడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ నేత మాసం మస్తానయ్య అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెడుతూ జైలులో ఉంచే ప్రయత్నం చేయడం ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో టీడీపీకి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కాకాణి, ప్రసన్నకుమార్‌రెడ్డిలను పరామర్శించేందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రేపు జిల్లాకు వస్తున్నారని, బీసీ నేతలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మున్సిపల్ సమావేశం నేడు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ గంగాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో పలు అంశాలపై కౌన్సిలర్ల ఆమోదం తెలిపేందుకు అజెండాను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 473 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 263 బేళ్లను కొనుగోలు చేయగా, వివిధ కారణాలతో 210 బేళ్లను తిరస్కరించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి శివకుమార్ మాట్లాడుతూ కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160 పలుకగా, సరాసరి రూ.187.53 లభించిందన్నారు. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కావలి (జలదంకి): 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా కావలి రూరల్ మండలంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలు మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తుమ్మలపెంట పట్టపుపాళెంలో రూ.42.60 లక్షలతో సీసీరోడ్ల పనులకు, పల్లెపాళెంలో రూ.44 లక్షలతో డ్రింకింగ్ వాటర్‌స్కీమ్, రూ.27.40 లక్షలతో సీసీరోడ్లకు, ఒట్టూరు గ్రామంలో రూ.25 లక్షలతో సీసీరోడ్లకు శంకుస్థాపన గావించారు. అనంతరం ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ఆత్మకూరురూరల్: త్రైత సిద్ధాంత భగవద్గీతపై మండలంలోని బోయలచిరివెళ్ల, గొల్లపల్లి, కరటంపాడు, సాతానుపల్లి, ఆరవేడు జంగాలపల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు పెంచల నరసయ్య మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు సమస్త మానవాళికి దిశానిర్దేశం చేశారన్నారు. ఆగస్టు 16న శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని తమ సంస్థ ఆధ్వర్యంలో 11 రోజుల పాటు స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కమిటీ సభ్యులు కొండయ్య, పద్మమ్మ, శేషాద్రి, నరసారెడ్డి, కల్పన, భాగ్యమ్మ, పెంచలయ్య, హరిప్రసాద్, మధు, గాయత్రి, కిశోర్, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

మర్రిపాడు: మర్రిపాడులోని ఓ ఫొటోస్టూడియో యజమాని ఇజ్రాయెల్ బైక్ అపహరణకు గురైంది. దీనిపై ఆయన మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గ్రామంలో వరుస చోరీలు కలకలం రేపుతోంది. గతంలో మండల పరిధిలోని రాజుపాళెం, పడమటిపాయుడుపల్లి పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైన విషయం తెలిసిందే.

మద్యం, బెల్టు దుకాణాలతో తీవ్ర ఇబ్బందులు



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

- మహిళల ఆవేదన

ఆత్మకూరు: ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ పట్టణంలో గ్రామాల్లో పుట్టగొడుగుల్లా మద్యం, బెల్టు దుకాణాలు వెలిశాయని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు మహిళలు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంగళవారం సీఐటీయూ, సీపీఎం నేతల సహకారంతో మహిళలు ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారులకు సమీపంలో ప్రార్థనా స్థలాలు, దేవాలయాల దగ్గర, మెయిన్ బజారులో ఇష్టారాజ్యంగా బెల్టు దుకాణాలు ఏర్పాటయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వ అనుమతులున్న మద్యం దుకాణాలు సైతం నిర్దేశించిన ప్రాంతాల్లో ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో పలు పనులపై బజార్లకు వచ్చే మహిళలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ముఖ్యంగా బెల్టు దుకాణాలకు సమయపాలన లేకపోవడంతో తాగుబోతుల విచ్చలవిడితనం ఎక్కువైందని వారు వాపోయారు. కాగా ఆర్డీఓ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కన్వీనర్ డేవిడ్‌రాజు, ఎ.నాగయ్య, గుల్జార్‌బేగం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న పర్యటనను విజయవంతం చేయండి

కావలి (జలదంకి): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనను కావలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ ద్వారా పరామర్శిస్తారన్నారు. అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శిస్తారని తెలిపారు. కావలి పట్టణ, రూరల్ మండలాలతో పాటు బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

- **బిట్రగుంట:** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేసేందుకు కార్యకర్తలంతా కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు అన్నారు. బోగోలులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్ని కుట్రలు చేసినా లెక్క చేయకుండా కార్యకర్తలంతా జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి



సంగం: పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

సంగం: రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.శశిధర్ తెలిపారు. మండలంలోని అన్నారెడ్డిపాళెం, దువ్వూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అన్నదాత సుఖీభవకు ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో..

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఉదయగిరి సహాయ వ్యవసాయ సంచాలకురాలు లక్ష్మీమాధవి పాల్గొని, మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ ప్రవీణ్, మండల విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

మైనింగ్‌ను ఆపండి

వరికుంటపాడు: మండలంలోని జంగంరెడ్డిపల్లి పక్ష తిప్పలో మైనింగ్ ప్రయత్నాలు నిలిపివేయాలని మంగళవారం పలువురు మహిళలు జడదేవిలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. మైనింగ్ జరిగితే తాము చాలా ఇబ్బందులు పడుతామని, లీజు రద్దు చేయాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈ లీజు గతంలో ఇచ్చారని, తాము ఏమీ చేయలేమని ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో ఏర్పాటైన అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని కమిషనర్ సి.గంగాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. అనధికార లేఅవుట్‌లలోని ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.